ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన

- మాధవధార వుడా కాలనీలో హ్యాండ్‌లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్
- ఈ నెల 28 వరకు నిర్వహణ


ఎగ్జిబిషన్‌లో చీరలు చూస్తున్న మహిళలు

మర్రిపాలెం: చేనేత తయారీ అంటేనే భారతదేశంలో ఎంతో ప్రసిద్ధి. నాణ్యమైన చేనేత వస్త్రాలు, హస్తకళల ఉత్పత్తిదారుల నుంచి నేరుగా వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకే హస్తకళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 12న చేనేత హస్తకళా హ్యాండ్‌లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ నెల 28 వరకు చేనేత ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకుడు సింహాద్రి సురేష్ తెలిపారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని, ఇందులో డిస్కౌంట్లు కూడా ఇస్తున్నట్లు చెప్పారు.


చెక్కతో చేసిన అలంకార గృహోపకరణాలు

ఇవీ లభ్యం..
ఎగ్జిబిషన్‌లో చేనేత, పట్టు, కాటన్ చుడిదార్లు, టాప్‌లు, డ్రెస్ మెటీరియల్స్, మహిళలకు చీరలు, కలంకారి, పోచంపల్లి, ఖాదీ, వెంకటగిరి, బెంగాలీ కాటన్, మంగళగిరి కాటన్, పట్టు చీరలు, నారాయణ్‌పేట, ఉప్పాడ, ఫ్యాన్సీ ఖాదీ, కాటన్ ప్రింటెడ్ బెంగాల్ సిల్క్స్, కాంతా వర్క్ కాటన్, భాగల్‌పూరీ సిల్క్, బాంధిని సిల్క్, గుజరాత్ డిజైనర్ టాప్స్, లక్నో చికెన్‌వర్క్, డోర్ కర్టెన్లు, డోర్ మ్యాట్‌లు, వరంగల్ తువ్వాళ్లు, బెట్ షీట్లు, రాజస్థానీ, జైపూర్ ప్రింటెడ్ టాప్స్, జైపూర్ కాటన్ బెడ్‌షీట్లు ఇలా వివిధ డిజైన్లు, రంగులతో ఆకట్టుకుంటున్నాయి. మగవారి కోసం కాటన్ షర్ట్‌లు, లుంగీలు, టవల్స్‌తోపాటు హ్యాండ్‌బ్యాగ్‌లు, పర్సులు, కొండపల్లి బొమ్మలు, ఇలా పలు రకాల అవసరమైన 60 షాపులు ఈ ప్రదర్శనలో ఉన్నాయి.


కాటన్ షర్ట్‌ల షాపు వద్ద వినియోగదారులు

ఈఈ రాష్ట్రాల నుంచి ఉత్పత్తులు..
దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, బిహార్, ఉత్తర్ ప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, గుజరాత్ రాష్ట్రాల నుంచి వచ్చి తయారీదారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రదర్శిస్తూ తాము తయారు చేసిన వస్తువులను విక్రయిస్తున్నారు. ప్రతి చేనేత కార్మికులు, వివిధ స్వయం ఉపాధి కార్మికులు స్వయంగా తయారు చేసిన హస్తకళలను ప్రోత్సహించాలని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. చేనేత ప్రదర్శన పెట్టిన నాటి నుంచి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు ఎక్కువ సంఖ్యలో వచ్చి కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. ఇంటి వద్దే ఇలాంటి చేనేత వస్త్ర ప్రదర్శనలు ఏర్పాటు చేయడంపై వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.


చేనేత టవళ్లు, లుంగీలు విక్రయిస్తున్న వ్యాపారి


ప్రత్యేక ఆకర్షణగా కొండపల్లి బొమ్మలు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కంచరపాలెం: జోన్–2 డివిజన్ కంచరపాలెం సెక్షన్ పరిధి సబ్ స్టేషన్‌లోని 11 కేవీ బర్మాక్యాంప్ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కంచరపాలెం, ఊర్వశి జంక్షన్, దేవేంద్ర నగర్, కంచరపాలెం రైతుబజార్, రవీంద్ర నగర్, ఐటీఐ జంక్షన్, నలందనగర్, ఇంటిలిజెన్స్ కార్యాలయం ఏరియా, అశోక్‌నగర్, రెడ్డి కంచరపాలెం, దుర్గానగర్, గొల్లకంచరపాలెం, తోట వీధి, తుమ్మడపాలెం, గోకుల్‌నగర్, గౌరీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మర్రిపాలెం సెక్షన్‌లో..
మురళీనగర్: జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి మర్రిపాలెం వుడా లేఅవుట్, మర్రిపాలెం 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మహారాణిపేట వీధి, మర్రిపాలెం మెయిన్ రోడ్డు, రాణాప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, జ్యోతినగర్, లక్ష్మీనగర్, గ్రీన్ గార్డెన్స్, మొహమ్మద్దీన్ గార్డెన్స్, మర్రిపాలెం, వుడా లేఅవుట్, లీడర్ ప్రెస్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మురళీనగర్ సెక్షన్‌లో..
మురళీనగర్ సెక్షన్ పరిధి పట్టాభిరెడ్డితోట 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్–2 ఈఈ బి.కె. నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పట్టాభిరెడ్డి గార్డెన్స్, ఎన్‌జీజీవోస్ కాలనీ, ఆంజనేయ స్వామి ఆలయం, రామాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

క్లుప్తంగా

30న ఇంగ్లిష్ భాషలో నైపుణ్యాలపై శిక్షణ


జీవన్‌కుమార్, లెక్సినో గ్రాఫర్

సీతంపేట: జాబ్ ఇంటర్వ్యూల్లో విజయం సాధించడానికి అవసరమైన ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలపై ఈ నెల 30న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు రంగసాయి మీడియా ప్రతినిధి బాదంగీర్ సాయి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిఘంటుకర్త(లెక్సినో గ్రాఫర్) సనపల జీవన్‌కుమార్‌చే ఇంగ్లిష్ భాషలో నైపుణ్యాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో అభ్యర్థులకు అరుదైన ఇంగ్లిష్ గ్రామర్, వకాబులరీ, విదేశీ పుస్తకాలను పీడీఎఫ్ రూపంలో అభ్యర్థుల మొబైల్ ఫోన్లకు అందజేస్తామన్నారు. నగరంలోని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, వారి ఇంగ్లిష్ మాట్లాడే విధానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గలవారు 82478 29025 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

26న షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం


సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు

మురళీనగర్: ఈ నెల 26న హిందుస్థాన్ షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించాలని షిప్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నిర్ణయించింది. మురళీనగర్ వాకర్స్ పార్కులో బుధవారం సాయంత్రం విశ్రాంత ఉద్యోగుల సంఘం నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వ రుసుం రూ.250 వసూలు చేయాలని సభ్యులు తీర్మానించారు. ఈ నెల 26న మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో నిర్వహించే ఆత్మీయ సమావేశంలో పలు సమస్యలపై చర్చించడంతోపాటు 80 ఏళ్లు దాటిన వారిని సత్కరించాలని నిర్ణయించారు. సమావేశంలో షిప్‌యార్డ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బి.సూర్యనారాయణ, అధ్యక్షుడు బూసి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన

కంచరపాలెం: ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసులు బుధవారం ఎన్ఏడీ కొత్తరోడ్డులోని నారాయణ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిర్‌పోర్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చక్రధర్ మాట్లాడుతూ గంజాయి, ధూమపానం, మద్యం తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎవరి వల్ల అయినా ఇబ్బందులు ఎదురైతే విద్యార్థులు డయల్ 100, 112, 1930 నంబర్లు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.ఎస్ఐ కె.రామకృష్ణ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగంతో జీవితాలు నాశనం


మాట్లాడుతున్న ఎస్ఐ సంతోష్

టీబీ రోడ్డు: డ్రగ్స్ వినియోగానికి అలవాటు పడితే జీవితాలు నాశనమైపోతాయని మూడో పట్టణ ఎస్ఐ సంతోష్ హెచ్చరించారు. బుధవారం రేసపువానిపాలెంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ సరఫరా చేయమమే కాదు వినియోగించడం కూడా నేరమేనని స్పష్టం చేశారు. చిన్న వయస్సులో డ్రగ్స్‌కు బానిసై ఎంతో మంది జీవితాలు అంధకారంగా మారాయన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని ఎస్ఐ సూచించారు.

ఉపనిషత్తులు విలువైన సంపద


మాట్లాడుతున్న రచయిత సత్యనారాయణమూర్తి

సీతంపేట: వేదాలు, ఉపనిషత్తులు భారతీయ సమాజం, పాశ్చాత్య సమాజాల మీద ప్రభావం చూపాయని కవి, రచయిత డాక్టర్ కె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో 'ఉపనిషత్తులు మన విలువైన సంపదలు' అనే అంశంపై జరిగిన సాహిత్య సభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. వేద కాలం పూర్వం నుంచి నేటి ఆధునిక సమాజం వరకు వేదాలు, ఉపనిషత్తులు భారతీయ, పాశ్చాత్య సమాజాలపై ఏ మేరకు ప్రభావం చూపాయో, వాటి అర్థాలను వివరించారు. అరిస్టాటిల్, వివేకానందుడు నుంచి నేటి ఆధునిక కవులు, తత్వవేత్తల మీద ఉపనిషత్తుల ప్రభావాన్ని తెలియజేశారు. గ్రీకు నుంచి అమెరికా వరకు పాశ్చాత్య కవులు వీటిని ఏ మేరకు ఆదరించారో వివరించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వేదాల్లో నాలుగు భాగాలైన సంహితలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తుల్లో ఒకటని పేర్కొన్నారు. ఇది పూర్తిగా జ్ఞాన కాండ అని, నేటి సమాజానికి ఎంతో ఉపయోగకరమైనదని, విదేశాల్లో సైతం ఈ విజ్ఞానం ఎందరో నేర్చుకుని లబ్ధి పొందుతున్నారని తెలిపారు. డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ ఉపనిషత్తులు మన పూర్వీకులు మనకు అందించిన అమూల్యమైన జ్ఞాన సంపదగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి. సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, సిహెచ్.చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ, చింతా ప్రభాకర్, జగదీశ్వరరావు, పీవీఆర్ కుమార్, బి.రాధారాణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలపై అవగాహన నేడు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ నెలవారీ సమావేశం మురళీనగర్ బృందావన్ పార్కులో గురువారం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు పార్కులో యోగా గురువు ఎం.శేషామణి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించి యోగాసనాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. క్లబ్ సభ్యులు పాల్గొనాలని ఆమె కోరారు.

సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన


రేసపువానిపాలెంలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు మన్‌మోహన్

సీతమ్మధార: దేశంలో 2047 నాటికి సికిల్ సెల్ అనీమియా వ్యాధిని నిర్మూలించే మిషన్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని రేసపువానిపాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మన్‌మోహన్ తెలిపారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో బుధవారం ఈ వ్యాధిపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా వ్యాధికి సంబంధించి రాబోయే రోజుల్లో స్క్రీనింగ్ టెస్ట్‌లు చేస్తామన్నారు. ఈ వ్యాధి వంశపారంపర్యంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమని పేర్కొన్నారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలగడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు అని వివరించారు. అలసట, తరుచుగా వచ్చే అంటువ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు, అవయం నష్టం కలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, సమస్యలు వచ్చినప్పుడు వెంటనే ఆస్పత్రిలో చూపించుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడుకుందాం

అల్లిపురం: మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మహారాణిపేట సీఐ పి.శ్రీనివాసరావు అన్నారు. విద్యార్థులతో కలిసి మహారాణిపేట పోలీసులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత మత్తుకు బానిసలుగా మారి వారి బంగారు భవిష్యత్‌ను, ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల గురించి ఎలాంటి సమాచారం తెలిసినా 14500 నంబరుకు తెలియజేయాలని కోరారు. తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా జగదాంబ జంక్షన్ నుంచి టర్నర్ చౌల్ట్రీ వరకు మత్తు పదార్థాలు నిర్మూలిద్దాం–యువతను కాపాడుకుందాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ ర్యాలీలో ఎస్.ఐ. అప్పలనాయుడు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, బోధకాలు వంటివి రాకుండా కాపాడుకోవాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ దోమల వ్యాప్తిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒకసారి ఎయిర్ కూలర్‌లో నీటిని మార్చాలని, మురుగు నీటి నిల్వలపై వారానికి ఒకసారి కిరోసిన్ లేదా ఆయిల్ చల్లాలని తెలిపారు. గంబూషియా చేపలు దోమల కుంట్లలో వదిలితే దోమల ఉత్పత్తి జరగదన్నారు. జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ దోమల బెడద నుంచి రక్షణకు దోమ తెరలు వాడాలన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి మాట్లాడుతూ దోమల నియంత్రణ మనందరి బాధ్యత కనుక పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) సమన్వయకర్త డాక్టర్ సమత మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు నిర్మూలించటంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందే కాకుండా ఎవరి ఇంట్లో వారు శ్రద్ధ వహించి దోమలు పెరగకుండా చూసుకోవాలన్నారు.

వాల్తేర్ డివిజన్ టెక్నీషియన్లకు ప్రత్యేక సదస్సు


సెమినార్‌లో పాల్గొన్న టెక్నీషియన్లతో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో రైలు ఎస్కార్టింగ్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్లకు బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. రైలులో ఎలక్ట్రికల్ విధులు నిర్వర్తించే సిబ్బందికి నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ సెమినార్ ఏర్పాటు చేశారు. రైళ్లలో ప్రయాణించే సమయంలో ఎదురయ్యే లైటింగ్, ఏసీ, థర్మల్ కంఫర్ట్ వంటి సమస్యలను పరిష్కరించడంలో వీరు కీలకపాత్ర పోషిస్తుంటారు. ప్రయాణికులకు సుఖవంతమైన, సౌకర్యవంతమైన, భద్రతతో కూడిన ప్రయాణాన్ని అందించేందుకు వీరు నిత్యం రైళ్లలో ప్రయాణిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తుంటారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికులకు అత్యంత ప్రమాణాలతో కూడిన సేవలందించడమే తమ ప్రాధాన్యమని తెలిపారు. కౌన్సెలింగ్ సెమినార్ ద్వారా భద్రత, సురక్షితం గురించి టెక్నీషియన్లకు ఎన్నో విషయాలు తెలియజేసినట్లు చెప్పారు. ఆయా విభాగాల మధ్య ఉన్నతాధికారులతో కమ్యూనికేషన్ విధానాలు, టీం వర్క్, సహకారం అంశాలపై వివరించారు.

22 నుంచి భజ గోవిందంపై ప్రవచనాలు


కరపత్రం ఆవిష్కరిస్తున్న భారతి, అనురాధ, శాంతిప్రియ

సీతమ్మధార: నిష్కామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 25 వరకు శంకరాచార్యుల రచించిన భజ గోవిందంపై ప్రవచనాలు నిర్వహించనున్నట్టు సంస్థ కోశాధికారి కె.భారతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆశీలమెట్టలోని సంస్థ కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీ డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ప్రతి రోజు సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు భజనలు, 6 నుంచి 7 గంటల వరకు ప్రవచనాలు జరుగుతాయన్నారు. భజగోవిందం 31 శ్లోకాల్లోని 31 సూక్తులు, జీవన విధానాలను నిష్కామ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అరుణజీ తమ ప్రవచనాల్లో తెలుపుతారన్నారు. తమ సంస్థ ద్వారా మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణకు చేయూత, అన్న వితరణ వంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధి ఎం.అనురాధ, ఫౌండేషన్ ప్రతినిధి ఎన్. శాంతిప్రియ మాట్లాడుతూ ఈ కార్యక్రమాలను నగర ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి తిరువీధి ఉత్సవం


ఘాట్‌రోడ్డు మీదుగా సాగుతున్న తిరువీధి ఉత్సవంలో మహిళల కోలాటం


సత్యనారాయణ స్వామి తిరువీధి ఉత్సవం

దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం తిరువీధి రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విశేష హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు తిరువీధి రథయాత్ర చేపట్టారు. స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన తిరువీధి రథయాత్ర ఘాట్‌రోడ్డు, పూర్ణామార్కెట్, పోలీస్ బ్యారెక్స్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా తిరిగి సత్యనారాయణస్వామి ఆలయం వరకు సాగింది. దారి పొడవునా కోలాటం.. సంకీర్తనలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో బుద్ద నాగజగదీష్ పర్యవేక్షించారు.


అలంకరణలో స్వామివారు

నేడు వైదిక సదస్యం
దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు, 9 గంటలకు సుదర్శన హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు వైదిక సదస్యం, మహదాశీర్వచనం (పండిత సత్కారం) చేపట్టనున్నారు.

జూలో మకరంద మొక్కల పెంపకం


జూ సీతాకోక చిలుకల పార్కులో మొక్కలు నాటుతున్న క్యూరేటర్(ఎఫ్ఏసీ) మంగమ్మ

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం కొద్ది రోజులుగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మారిసన్ హెర్స్‌ఫీల్డ్ ఉద్యోగులు బుధవారం జూలోని సీతాకోక చిలుకల పార్కులో మకరంద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని జూ క్యూరేటర్(ఎఫ్ఏసీ) జి.మంగమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతాకోక చిలుకలకు ఉపయోగపడే మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ఈ మొక్కలు సీతకోక చిలుకలకు స్థిరమైన ఆవాసాలుగా నిలుస్తాయన్నారు. జీవవైవిధ్యం, సహజ సౌందర్యంతో కూడిన పర్యావరణాన్ని పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో మారిసన్ హెర్స్‌ఫీల్డ్ ఉద్యోగులు, జూ అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు భారతి, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం ఎన్నికలు జరిపించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వెంటనే జరిపించాలని విశాఖ ఉక్కు శ్రామిక సంఘం అధ్యక్షుడు ఎం.కోటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉక్కు కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు సాధించడంలో ఏఐటీయూసీ పూర్తిగా విఫలం చెందిందన్నారు. కార్మికుల హక్కులకు ఒక్కొక్కటి చొప్పున తాకట్టు పెట్టిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. అన్ని కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్లను వ్యాపార కేంద్రాలు మార్చారన్నారు. యూనియన్ గుర్తింపు ఈ నెల 9తో ముగిసినందున వెంటనే ఎన్నికలు జరిపించాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కరణం సత్యారావు, బొడ్డు రమణ, కరణం సురేష్, యు అప్పలరాజు, కె.బాల యోగి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలి

డాబాగార్డెన్స్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్. రవిచంద్రన్, ఫస్ట్ లేడీ చిత్ర రవిచంద్రన్ ఆకాంక్షించారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ–201ఏ ఆతిథ్యం మేరకు అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన విశాఖకు గుడ్‌విల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ద్వారా సమాజానికి అందిస్తున్న కోట్లాది రూపాయల సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జోరుగా.. హుషారుగా పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని ఆట పాటలు.. నృత్యాలతో సందడి చేశారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ గుప్త, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు, ప్రాజెక్టు చైర్మన్ పి.లక్ష్మీగుప్త తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ప్రశాంత జీవనం


యోగాసనాలు వేస్తున్న ధ్యానులు

అగనంపూడి: మానసిక ఆందోళనలు, శారీరక రుగ్మతల నుంచి బయటపడడానికి యోగ సాధన ఒక్కటే మార్గమని రాజయోగి బ్రహ్మకుమారి చంద్రశేఖర్ భాయిజీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీస్ అగనంపూడి శాఖ దివ్యజ్యోతి భవనం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక యోగా శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. మానసిక ఆనందం, పరిపక్వతకు యోగా, ధ్యానం చక్కటి మార్గమన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ రాజయోగి బీకే సోమేశ్వరి మాట్లాడుతూ నిజజీవితంలో మనిషి మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. చదువుకునే విద్యార్థి నుంచి వయో వృద్ధుల వరకు మానసిక ఆందోళనలకు గురవుతున్నారని, వీటన్నింటికీ చక్కని మార్గం యోగసాధన అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ యోగాసనాలు, వాటి వల్ల కలిగే ఆరోగ్యపరమైన ఉపయోగాలు వివరించారు. ప్రాణాయామం, ధ్యానం చేయించారు.